క్లుప్తంగా

స్థాయిని మరిచి విమర్శించడం తగదు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డిపై బీజేపీ నాయకులు స్థాయిని మరిచి విమర్శించడం సరికాదని ఆర్మూర్ ఎంఎసీ చైర్మన్ సాయిబాబా గౌడ్ అన్నారు. పెర్కిట్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వినయ్‌రెడ్డి ప్రజాప్రతినిధి హోదాలో అధికారులతో కలిసి ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థల పరిశీలనకు వెళ్లాడని తెలిపారు. బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు, అనవసర విమర్శలు చేస్తే ఊరుకునేదిలేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, పండిత్ పవన్, మోత్కూరి లింగా గౌడ్, పండిత్ పవన్, కొంతం మురళీధర్, లిక్కి శంకర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

నందిపేట్(ఆర్మూర్): మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని, ఆత్మహత్యలను నివారించాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ ఇన్‌చార్జి సాప పండరీ అన్నారు. మండలంలోని వెల్మల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం ఎస్‌జేడబ్ల్యూహెచ్ ఆర్‌సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యా సరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. జిల్లా కన్వీనర్ కటికే నరేష్, సభ్యులు బ్యాగరి సంజీవ్, బండారి రజినీకాంత్, గుండురవి పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని ప్రభుత్వం



ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధులు కలిగొట గంగాధర్, జెస్సుఅనిల్ అన్నారు. పట్టణంలోని బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు 100రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేసేవిధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. నాయకులు పోల్కం వేణు, పులి యుగంధర్, మీసాల రాజేశ్వర్, దొండి ప్రకాష్, ఉదయ్‌గౌడ్, దక్షిణా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఆర్మూర్‌టౌన్(ఆర్మూర్): టీఎన్‌జీవోస్ ఆర్మూర్ యూనిట్ అధ్యక్షుడిగా పట్టణంలోని వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న కుంట శశికాంత్ రెడ్డి ఎన్నికయ్యారు. జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా న్యాలకంటి విశాల్, సహధ్యక్షుడిగా లయన్ శేఖర్, కోశాధికారిగా కస్తూరి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆర్మూర్ యూనిట్ పూర్వ అధ్యక్షుడు శికారి రాజు, కార్యదర్శి గోవర్ధన స్వామి, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహధ్యక్షుడు చిట్టి నారాయణ రెడ్డి, కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

బాల్కొండ: ముప్కాల్‌లో సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'ఛలో ఢిల్లీ' కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరి మూర్తి మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి 18 వరకు ఢిల్లీలో నిర్వహించే బీసీ సభలను విజయవంతం చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు గోపి రాము, ఉపాధ్యక్షులు బొంబాయి రాజు, మహేందర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలి

బాల్కొండ: మండలకేంద్రంలో ఈనెల 10 నుంచి నిర్వహించే మండలస్థాయి సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. గ్రామస్థాయి పోటీలను ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించాలన్నారు. ప్రతిభ కనబరిచిన జట్లను మండల స్థాయికి పంపాలన్నారు. బాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో అండర్-14, అండర్-19, యువజన స్థాయిలో ఎంపిక చేయాలన్నారు. బాలుర విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో , అండర్-14, అండర్-19, యువజన స్థాయిలో ఎంపిక చేయాలన్నారు.

బడి నిర్మాణం పూర్తయ్యేదెన్నడు?

- పోచంపాడ్ జెడ్పీహెచ్‌ఎస్ నూతన భవనం కోసం నిధులు మంజూరు
- రెండేళ్లవుతున్నా పూర్తికాని పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణం



పోచంపాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణ పనులు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల నూతన భవన నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. పోచంపాడ్ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంతో పాటు ఉర్దూ మీడియం కూడా కొనసాగుతోంది. పాఠశాలలో మొత్తం 360 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం రేకుల షెడ్డుతో ఉండటంతో గత ప్రభుత్వం మన ఊరు- మన బడిలో భాగంగా రూ.2కోట్ల 10లక్షల 60వేల నిధులను నూతన భవనం కోసం మంజూరు చేసింది. 2023 జనవరిలో పనులకు శంకుస్థాపన చేయగా, ఆరు నెలల తరువాత పనులను ప్రారంభించారు. ప్రస్తుతం పనులు నిలిచి ఆరు నెలలు గడుస్తున్న పట్టించుకునే వారు లేరు.

ప్రాథమిక పాఠశాలలో..

పోచంపాడ్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం, పాఠశాలలో మౌలిక వసతుల కోసం గత ప్రభుత్వం రూ.72.69 లక్షల నిధులను మంజూరు చేసింది. పనులు చాలా రోజుల తరువాత ప్రారంభించారు. సగం పనులు కాగానే నిలిపి వేశారు. విద్యార్థులు తరగతి గదుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలో అభివృద్ధి పనులకు సైతం రూ.49.06 లక్షల నిధులను మంజూరు చేసింది. ఆ పాఠశాలలో కూడా పనులు కూడ ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిన పనులను వెంటనే పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు సకాలంలో అందక..

బడి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో అందకపోవడంతో పనులు మధ్యలోనే ఆపివేసినట్లు తెలుస్తోంది. గతంలో ఆర్ఎంఎస్ ద్వారా కొంత నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు కూడ పూర్తి కాలేదు. నిధులు మంజూరైన పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. వచ్చిన కాంట్రాక్టర్‌లు పాత ఎస్ఎల్ఆర్ ధరల ప్రకారం నిధులు కేటాయించడంతో పనులు చేపట్టలేక వదిలేసి పోతున్నారు. చేసిన పనులకు కూడ బిల్లులు సకాలంలో అందడం లేదని కాంట్రాక్టర్ చేతులు ఎత్తేసినట్లు తెలిసింది. పాఠశాలలో మూడు మీడియాలు ఉండటంతో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. తరగతుల నిర్వహణకు కూడ గదులు ఎక్కువగా అవసరం ఉంటాయి. కానీ ఇవన్నీ పాలకులు పట్టించుకోవడం లేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

పోచంపాడ్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో నూతన భవనం, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నిలిచిపోవడంపై ఉన్నత అధికారులకు నివేదించాం. బిల్లులు రాకపోవడంతో పనులు చేపట్టడం లేదని నిర్వాహకులు తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, ఎంఈవో, మెండోరా

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మోకన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. మండలంలోని సిరన్‌పల్లి, అబ్బాపూర్(బి) తండాలో మొరం రోడ్డు పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన సాగునీటి వనరులను కల్పించేందుకు పుష్కలంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 70శాతం మేర రైతులకు బోనస్ చెల్లింపులు జరిగాయని పేర్కొన్నారు. విద్యారంగాన్ని పటిష్టం చేశామని, నిరుపేద తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యాసంస్థల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మోకన్‌పల్లి గ్రామంలో రూ. 80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. మరిన్ని సౌకర్యాలకు రూ. 20 లక్షలను అదనంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, కాంగ్రెస్ నాయకులు పులి శ్రీనివాస్‌రావ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భగవాన్ పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి..

వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల జాతీయ వేదిక జిల్లా ప్రతినిధులు కోరారు. ఈమేరకు వారు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. వికలాంగులకు ప్రతి నెలా రూ. 6వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. వేదిక ప్రతినిధులు ఏశాల గంగాధర్, గైని రాములు, నజీర్, రాకేష్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



సిద్ధాపూర్ పాఠశాలలో బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేష్ బాబు



సోన్‌పేట్‌లో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

మోర్తాడ్: కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏర్గట్ల మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో శివకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా చూడాలని సిబ్బంది తెలిపారు. ఎంపీవో శివచరణ్, కార్యదర్శి జాకీర్, ప్రత్యేకాధికారి సంధ్య ఉన్నారు.

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్: మండలంలోని సిద్ధాపూర్, సులేమాన్‌నగర్ గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్ బాబు పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. వంట గది, స్టోర్ రూంలో నిల్వ ఉన్న బియ్యం, సరుకుల నాణ్యత పరిశీలించారు.

కోటగిరి మండల కేంద్రంలో..

కోటగిరిలోని రచ్చగల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ గంగాధర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇస్తున్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతతో కూడిన సరుకులను వంట కోసం వినియోగించాలని సిబ్బందికి సూచించారు.



ఏర్గట్ల కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి శివకృష్ణ

మెండోరా మండలంలో..

బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్ గ్రామ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



ఆర్మూర్‌లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు



భీమ్‌గల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

- ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌రాజు
- కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు

ఆర్మూర్‌టౌన్: ప్రజలు తమ కాలనీల్లో చెత్తను వేయకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రజలు తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి మున్సిపల్‌కు సంబంధించిన చెత్తసేకరించే వాహనాలకు అందించాలన్నారు. కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, సానిటరి ఎస్సై గజానంద్, పూర్ణమౌళి తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో..

మోర్తాడ్: భీమ్‌గల్‌లో సోమవారం ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ప్రేమలత, కమిషనర్ రామకృష్ణ, కౌన్సిలర్‌లు సీహెచ్ గంగాధర్, సతీష్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు అజ్మతుల్లా, కాంగ్రెస్ నాయకులు జేజే నర్సయ్య, అనంతరావు, నల్లూరి శ్రీనివాస్, సాదుల్లా, వాకా మహేష్, సతీష్, అక్షయ్, విక్రమ్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలోనే ఆస్పత్రి నిర్మించాలి

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రభుత్వ భూమిలోనే నిర్మించాలని ముప్కాల్ పరిరక్షణ సమితి సభ్యులు కోరారు. ఈమేరకు వారు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకొని ఆరోగ్యకేంద్రం నిర్మించాలన్నారు. సభ్యులు సంజీవ్, మహేశ్, సాయన్న, రాము, గంగారాం పాల్గొన్నారు.

అడవులను కాపాడాలి

కమ్మర్‌పల్లి: ప్రతిఒక్కరూ అడవులను కాపాడాలని అటవీశాఖ అధికారులు సూచించారు. ఈమేరకు మండలంలోని ఇనాయత్‌నగర్‌లో ప్రజలకు సోమ వారం అటవీ శాఖ ఆధ్వర్యంలో 'అడవికి నిప్పు- నివారణ చర్యల'పై అవగాహన కల్పించారు. అడవికి నిప్పు పెట్టొద్దని, ప్రమాదవశాత్తు నిప్పు తగిలితే తమకు సమాచారం ఇవ్వడంతో పాటు, నివారణ చర్యలను సూచించారు. అధికారులు బాపురావు, పవన్, శ్రీదేవి, మాజీ సర్పంచ్ లస్కర్ ఉన్నారు.

'అసంపూర్తిగా రుణమాఫీ'

వేల్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా రుణమాఫీ చేసిందని బీఆర్ఎస్ రైతువిభాగం జిల్లా నాయకుడు మిట్టపల్లి మహిపాల్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలో సుమారు లక్షా 77 వేలకు పైగా రైతులకు ఇంకా రుణమాఫీ జరుగలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.25వేలు మొదలుకొని రూ.లక్ష వరకు రుణమాఫీ చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినదానికి చేస్తున్న దానికి పొంతన లేదన్నారు. పట్టాదారు పాసుబుక్ ద్వారా తీసుకున్న పంట రుణాలన్ని బేషరతుగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

పింఛన్ డబ్బులు అందించాలి



రెంజల్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పింఛన్‌దారులు

రెంజల్(బోధన్): వారం రోజులుగా పోస్టాఫీసుకు తిరుగుతున్నా పింఛన్ డబ్బులు ఇవ్వడంలేదని వృద్ధులైన పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం వారు రెంజల్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన వృద్ధ, వికలాంగులైన పింఛన్‌దారులు పోస్టాఫీసుకు వచ్చారు. డబ్బులు లేవని సిబ్బంది సమాదానం చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. గత నెలలో చెల్లించాల్సిన పింఛన్ డబ్బుల కోసం వారం రోజులుగా కార్యాలయానికి తిరుగుతున్న పట్టించుకోడం లేదని వాపోయారు. సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం పోస్టాఫీసు నుంచి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని ప్రధాన గేటు ముందు బైటాయించారు. విషయం తెలుసుకున్న రెంజల్ పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌రావు అక్కడికి చేరుకుని విషయం అడిగి తెలుసుకున్నారు. వారిని వెంట తీసుకుని పోస్టాఫీసుకు వెళ్లి చర్చించారు. మంగళవారం నుంచి పింఛన్ డబ్బులను పంపిణీ చేస్తామని పోస్టాఫీసు సిబ్బంది మాటివ్వడంతో పింఛన్ దారులు వెనుతిరిగారు.

■ గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట కేజీబీవీ పాఠశాలలో సోషల్ స్టడీస్ బోధనకు (గెస్టు ఫ్యాకల్టీ) అతిథి అధ్యాపకురాలి పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శాంతి కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ సోషల్ స్టడీస్‌తోపాటు బీఈడీ చేసి మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ. 18వేల వేతనం ఉంటుందని తెలిపారు.

సమాచారం..

■ కోటగిరి కేజీబీవీలో..

కోటగిరి(రుద్రూర్): కోటగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తాత్కాలిక పద్ధతిలో సాంఘిక శాస్త్రం బోధించడానికి అర్హత కలిగిన మహిళా టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి సవిత రాణి తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 5లోపు దరఖాస్తులు అందచేయాలని కోరారు. మరిన్ని వివరాలకు కోటగిరి కేజీబీవీలో సంప్రదించాలని తెలిపారు.

■ మోర్తాడ్ కేజీబీవీలో..

మోర్తాడ్: మోర్తాడ్‌లోని కస్తూర్బా కళాశాలలో నర్సింగ్ కోర్సు బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి స్వప్న సూచించారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు ఇందుకు అర్హులు అని తెలిపారు. ప్రతి నెలా వేతనం రూ.23వేల వరకు ఉంటుందని తెలిపారు. అర్హులైన వారు ఈనెల 5లోగా మోర్తాడ్‌లోని కస్తూర్బా కళాశాలలో దరఖాస్తులు అందించాలని తెలిపారు.

ఆధ్యాత్మికం..

■ శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకిసేవ చేపట్టారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, నరేష్, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 – ఉక్కు సత్యాగ్రహం(తెలుగు)-10.30 ఝూన్సీ ఐపీఎస్(తెలుగు)-1.30 మోనా-2 (ఇంగ్లీష్)-4.50 7.15 9.40
- స్క్రీన్-2 – రోటి కపడా రొమాన్స్ (తెలుగు) - 12.05 6.15 భైరతి రణగల్ (తెలుగు) - 3.20 9.30
- స్క్రీన్-3 – కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్) -తెలుగు- 12.50 లక్కీభాస్కర్ (తెలుగు) - 3.45 7.00 జీబ్రా (తెలుగు) - 10.15
- స్క్రీన్-4 – అమరన్(తెలుగు)-11.20 2.50 6.20 9.50

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 అమరన్(తెలుగు)-10.25 భైరతి రణగల్(తెలుగు)-1.30,7.35 రోటి కపడా రొమాన్స్ - 4.30 10.30
- స్క్రీన్-3 మోనా-02(ఇంగ్లీష్ 3డీ)-11.00, 7.35,10.30 ఇష్క్(తెలుగు)-1.30 రోటి కపడా రొమాన్స్(తెలుగు)-4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 అమరన్ - 12.00 , 7.00, 10.30 - భైరతి రణగల్(తెలుగు)-4.05
- స్క్రీన్-2 మోనా-2(3డీ ఇంగ్లీష్)-11.00,1.25, 6.45, 9.10 కేశవ చంద్ర రమావత్(కేసీఆర్) 3.50
- స్క్రీన్-3 ఝూన్సీ ఐపీఎస్(తెలుగు)-10.25 ఫస్ట్ కేస్ ఆఫ్ ఉద్వేగం(తెలుగు)-1.45 భైరతి రణగల్(తెలుగు)-4.30 లక్కీ భాస్కర్(తెలుగు)-7.25 జీబ్రా(తెలుగు)- 10.40
- స్క్రీన్ -4 కేశవ చంద్ర రమావత్(కేసీఆర్)-10.05 రోటి కపడా రొమాన్స్(తెలుగు) -1.00,7.15 ఉక్కు సత్యాగ్రహం(తెలుగు)-4.15 భైరతి రణగల్(తెలుగు)-10.30

- **లలితామహల్** భైరతి రణగల్(తెలుగు)
- **దేవి** జీబ్రా(తెలుగు)-11.15,6.15 మెకానిక్ రాకీ (తెలుగు)-2.15,9.15
- **నటరాజ్** అమరన్ (తెలుగు)
- **విజయ్** ఇష్క్ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,300	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	71,317		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

సంక్షిప్తం

ఉపాధిహామీ పనుల పరిశీలన

వేల్పూర్: మండలంలోని కొత్తపల్లి ఎస్ గ్రామంలో సోమవారం ఉపాధిహామీ పనులను వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి పరిశీలించారు. ప్రతి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 8 వేల మొక్కల పెంపకానికి బ్యాగుల్లో మట్టినింపే పనులు సాగుతున్నాయని టెక్నికల్ అసిస్టెంట్ సుకేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ ఆయనకు తెలిపారు. పక్షులు, వన్యప్రాణులకు ఉపయోగపడే మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

ఆర్థికసాయం అందజేత

ఆర్మూర్: మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి చిన్ననాటి స్నేహితుడు పట్టణంలోని చౌల్ అశోక్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గంగారెడ్డి పరామర్శించి, రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. మరో స్నేహితుడు పద్మ మురళి రూ. 5వేలు అందజేశారు.

జాతీయ అవార్డుకు ఎంపిక



రెంజల్(బోధన్): మండలకేంద్రానికి చెందిన మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ అవార్డు గ్రహీతకు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. 15న ఢిల్లీలో అవార్డుల ప్రదానం ఉంటుందని రవి తెలిపారు.

ఎడపల్లి మండలంలోని రాజశేఖర్‌కు..



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఏఆర్పీ క్యాంప్ గ్రామానికి చెందిన యువజన సంఘాల సమితి అధ్యక్షుడు రాజశేఖర్ డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం నేషనల్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈనెల 15న న్యూఢిల్లీలో అవార్డు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సోమవారం 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు కుర్చీలను అందజేశారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్..

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు హెచ్‌ఎం చౌడారం రాంప్రసాద్ గణిత స్టడీ మెటీరియల్ వితరణ చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ సభ్యుల స్టడీ టూర్

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు సోమవారం తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు స్టడీ టూర్‌కు వెళ్లారు. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, సభ్యులు జైడీ శ్రీనివాస్, మహిపాల్, రాములు, రంజిత్, బాబన్న, లింగారెడ్డి తదితరులు వెళ్లారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు

ఎడపల్లి(బోధన్): మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. పలు అంశాలపై కవిత వారితో చర్చించారు. నాయకులు నాగేందర్ రెడ్డి, రవీందర్ గౌడ్, మహబూబ్, మహేందర్‌రెడ్డి, సాయన్న, సుమన్, శ్రీనివాస్, సాయిలు ఉన్నారు

బహుమతుల ప్రదానం

నవీపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. సైంటిస్ట్ మండాజి నర్సింహాచారి, వడ్డెరవి, నాయకులు తెడ్డు పోశెట్టి, నవీన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమను రెగ్యులర్ చేయాలని ఎస్ఎస్ఏ(సమగ్ర శిక్ష అభియాన్) ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండలకేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం వద్ద సోమవారం వారు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సీఆర్‌పీ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండలాధ్యక్షుడు ప్రవీణ్, గంగామణి, సురేందర్, అంజయ్య, మంజుల, పెద్దులు, రతన్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద సోమవారం ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని కోరారు.

క్రీడా దుస్తుల వితరణ

పెర్కిట్(ఆర్మూర్): పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎన్నారై సామ దీపక్‌రెడ్డి సోమవారం క్రీడా దుస్తులు వితరణ చేశారు. అలాగే గ్రామానికి చెందిన వెంకటేష్, శ్రీకాంత్ స్పోర్ట్స్ షూలను అందజేశారు.